# యువ వెలుగు

యువ వెలుగు - ప్రజల వెలుగు | PRGI:- TGTEL/26/A6429 | తెలుగు దిన పత్రిక

www.yuvavelugu.com | Epaper.yuvavelugu.com | yuvavelugu tv

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : పి.మహేష్ గౌడ్ సంపుటి : 1 సంచిక : 16 శుక్రవారం, సెప్టెంబర్ 18, 2026 , పేజీలు - 04 వెల: 2/-



యువ వెలుగు

తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

PRESS

మండలం | నియోజకవర్గం | జిల్లా

వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602


## వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం




# తెలంగాణ నేలది ధిక్కార స్వరం

● భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ● సెప్టెంబర్ 17 ప్రజాస్వామిక పాలనకు ?మార్గం వేసిన రోజు ● రైతులకు భరోసా ఉండాలి...?మహిళలు ఆర్థికంగా ఎదగాలి ● ప్రతి పేదబిడ్డకూ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం ● ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరాలనే లక్ష్యంతో పాలన : ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అనీ, సమ్మక్క సారలమ్మ పోరాటం, తెలంగాణ రైతాంగ సాయు ధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఏది చూసినా అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ గడ్డ స్వభావ మని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్ప టికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలి స్తూనే ఉందన్నారు. తెలంగాణ చరిత్ర ప్రజలే కేంద్రంగా పాలన ఉండాలని చెబుతున్నదనీ, అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ, ప్రపంచంతో పోటీపడేలా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు.

మిగతా2లో...

# నా దేవాలయ సందర్శనను వక్రీకరించారు

● బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** రాజకీయ స్వలాభం కోసం, పవిత్రమైన దేవాలయ సందర్శనను వక్రీకరించి తనపై అత్యంత చవకబారు ఆరోపణలు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌లపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్ రావు పరువు నష్టం దావా దాఖలు చేశారు. తనపై క్షుద్రపూజల ఆరోపణలు చేసిన ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలపై హరీశ్‌రావు తరఫు న్యాయవాదులు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ క్రిమినల్ వద్ద పరువు నష్టం దావా దాఖలు చేశారు. బీఎన్ఎస్ 2023 చట్టంలోని సెక్షన్ 356 కింద వారిపై కఠిన చర్యలు

మిగతా2లో...

# సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

● నాలుగేండ్లలోనే లక్ష్యాన్ని సాధించాం :మోడీ ● 76వ ఏట అడుగుపెట్టిన ప్రధానికి పలువురి శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 17 :** భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేండ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.“కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ

మిగతా2లో...

## కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో
# విచారణకు సిద్ధం

ముఖ్యమంత్రికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలి

అసత్యాలతో అసెంబ్లీ పవిత్రతను దెబ్బతీస్తున్న సీఎం

మాపై సస్పెన్షన్ ఎత్తేసి నెలరోజులు సభ జరపాలి :జాతీయ సమైక్యతా దినోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు, సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 – జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...




## డిసెంబర్ నుంచి 'హార్వర్డ్' కోర్సులు

## పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 30 న తుది ఓటర్ల జాబితా

ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం




## కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

- టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



**ఢిల్లీ,సెప్టెంబర్ 17** ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'ఆఫ్ ది రికార్డ్' సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరిగిపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబ భూముల గురించిన వివరాలను చాలా లోతుగా సభ దృష్టికి తీసుకువచ్చారని

మిగతా2లో...

## అడ్డంగా దొరికిన కెసిఆర్




**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** ఎన్నికల అఫిడవిట్‌తో కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికిపోయిందని, సున్నా నుంచి వేల కోట్ల విలువైన ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కెసిఆర్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. తనకు ఒక్క ఎకరం కూడా భూమి లేదని 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కెసిఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

మిగతా2లో...

# తెలంగాణ నేలది ధిక్కార స్వరం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో నిజాం ప్రాంతం అంతర్భాగం కావాలన్న ఆకాంక్షతో ఆంధ్రమహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయని వివరించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటానికి రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు నాయకత్వం వహించారని తెలిపారు. ఆపరేషన్ పోలోతో నిజాం ప్రభువు భారత ప్రభుత్వానికి లొంగిపోయారనీ, 1947 సెప్టెంబర్ 17 నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామిక పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రాత్మక సందర్భమని చెప్పారు. అందుకే ప్రజా పాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడటం, ప్రభుత్వ వనరులు అందరికీ అందేలా చూడటం, ప్రతి మనిషీ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడమే ప్రజా పాలన అని స్పష్టం చేశారు. **ప్రజాప్రభుత్వం రైతు పక్షపాతి** ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అనీ, రూ.20,616 కోట్లు విడుదల చేసి రుణమాఫీ ద్వారా 23.35 లక్షల రైతుల కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయపడేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి రూ.1.72 లక్షల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. భూభారతి చట్టం ద్వారా సంస్కరణలు తీసుకొచ్చామనీ, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించామనీ, 5.94 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామనీ, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీ వంటి పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందనీ, ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికమని చెప్పారు. **ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి...ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగాలి**రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డా ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదిగి సగర్వంగా జీవించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల ఖర్చు ఆదా అయిందని వివరించారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం చేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజి, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని వివరించారు. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దెబస్సులు, సోలార్ ప్లాంట్ల ద్వారా మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెడుతున్నామని సగర్వంగా చెప్పారు. **ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలి** రాష్ట్రంలోని ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 15 లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామనీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామనీ, త్వరలో మరో 2.25 లక్షల మందికి ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్లకు తొలిదశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామనీ, హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల ద్వారా లక్ష ఇండ్లు కడుతామని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించామనీ, దాని ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతికి పంపామని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి దేశంలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేపట్టామని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన తెలంగాణ సోషల్ జస్టిస్ డేను నిర్వహిస్తున్నామన్నారు. **విద్యా, వైద్యం రెండు కండ్లు** తమ ప్రజాప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కండ్లలాంటివని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులకు అల్పాహారం, పాలు ఇచ్చేందుకు రూ.927 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. 11 లక్షలమంది విద్యార్థులకు నేరుగా స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్లనే నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. విద్యారంగంలో తీసుకున్న చర్యలతో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని తెలిపారు. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ ద్వారా ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామనీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2,526 కోట్ల సహాయాన్ని అందించామని వివరించారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో నూతన ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం మొదలైందన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించామనీ, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను, వరంగల్ ఆస్పత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామనీ, ఆ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. యువతలో నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామనీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. **మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాం** రాష్ట్రంలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామనీ, రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపామనీ, ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తున్నామన్నారు. ఆహార కల్తీని అరికట్టేందుకు టీజీసేఫ్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, దేశ జీడీపీలో 10 శాతానికి వాటాను పెంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ప్రత్యేక జోన్లతో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని చెప్పారు. రీజినల్ రింగురోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6,924 కోట్లతో రహదారుల పనులు సాగుతున్నాయన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయనీ, ఈ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని తెలిపారు. దీనిపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించే విషయంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు.

# కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందనీ, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ వైపు ఏ తప్పైనా బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు. **కాంగ్రెస్ హామీలన్నీ బోగస్** కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యిరోజుల విఫల పాలన చూశాక తేలిపోయిందని కేటీఆర్ విమర్శించారు. వాటిపై నిలదీస్తామన్న భయంతోనే బీఆర్‌ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కై అసెంబ్లీని ఏకపక్షంగా నడిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదన్న రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజులపాటు పొడిగించి, మాపై సస్పెన్షన్లను ఎత్తేయండి. కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై ప్రజల పక్షాన కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ. నాలుగు వేల పింఛన్లు, రైతులకు కరెంట్, సాగునీరు, రైతుబంధు, అర్థాంతరంగా రద్దు చేసిన రైతుబీమాపై సభాముఖంగా నిలదీస్తామని చెప్పారు. **ముఖ్యమంత్రి పదవికే రేవంత్‌రెడ్డి కళంకం** చట్టసభల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా, పెద్దరికంతో మాట్లాడాలే తప్ప అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రజలను, రాష్ట్రాన్ని, శాసనసభను తప్పుదోవ పట్టించడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను దుర్వినియోగం చేశారనీ, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసి అతను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెప్తే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు. **సీఎం మాటల్లోనూ అంతే నిజం** పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో 150 బెడ్రూములు ఉన్నాయనీ, బంగారు బాత్రూమ్‌లు కట్టారనీ, కొత్త సచివాలయం కింద నుంచి సొరంగం తవ్వుకుని లంకెబిందెలు తరలిస్తున్నారని చేసిన చిల్లర ప్రచారంలో ఎంత వాస్తవముందో, అసెంబ్లీలో సీఎం మాట్లాడిన మాటల్లోనూ అంతే నిజముందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టో, ఆరు గ్యారెంటీలు ఏ మేరకు అమలయ్యాయో, ముఖ్యమంత్రి ప్రసంగం కూడా అంతే వాస్తవరూపమని చెప్పారు. మైసూరు బజ్జీలో ఎంతైతే మైసూరు ఉంటుందో రేవంత్ రెడ్డి మాటల్లోనూ అంతే నిజముందని వివరించారు. రూ.80,000 కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఊరూరా ప్రచారం చేసి, ఢిల్లీ నుంచి ఆర్టిస్టులను, టూరిస్టులను రప్పించి, నాటకాలతో ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చినట్టే, నేడు కూడా అదే అబద్ధాల వరద పారిస్తున్నారని చెప్పారు. **సిరిసిల్లలో కబ్జా భూములనడం దుర్మార్గం** సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు, కార్మికులకు దశాబ్దాల క్రితం ఇచ్చిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జా భూములుగా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమని కేటీఆర్ విమర్శించారు.

# అడ్డంగా దొరికిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బిఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. గతంలో కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్ ను ఎక్స్‌లో షేర్ చేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత అధికారంలో ఉన్న పదేళ్లలో కెసిఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం,కెసిఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ల ద్వారా స్పష్టమవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే కెసిఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి నిలదీశారు. ఇదంతా ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదించుకుంటే డ్రామారావు (కెటిఆర్) మాత్రం పుట్టుకతోనే కెసిఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. మరీ కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేసారా? లేక, ప్రజలకు అబద్దాలు చెబుతున్నారా అని మంత్రి పొంగులేటి నిలదీశారు.ఎన్నికల అఫిడవిట్‌లో ఎకరం భూమినే కెటిఆర్ చూపించారు ఏళ్ల తరబడి కెటిఆర్ తన అమెరికా సక్సెస్ గురించి గొప్పలు చెప్పుకుంటూ చిన్నప్పటి నుంచే తనకు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెప్పుకున్నారని, కానీ, ఆయన స్వయంగా దాఖలు చేసిన 2009 ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం అసలు నిజాన్ని చెబుతోందని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. మరీ కెటిఆర్‌కు ఒక ఎకరం ఉన్న భూమి, వందల ఎకరాలుగా, వేల కోట్ల విలువైన భూములుగా ఎలా మారాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కుటుం బ పాలనలో అక్రమంగా ఆస్తులను కూడబెట్టుకున్న కెటిఆర్ ఇప్పుడు తెలంగాణకు నీతులు చెబుతున్నారని, దెయ్యాలు వేదాలు వల్లిస్తే ఇంతకంటే నమ్మశక్యంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు.

## డిసెంబర్ నుంచి 'హార్వర్డ్' కోర్సులు

**హైదరాబాద్:సెప్టెంబర్ 17 :** ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఔత్సాహికుల కోసం ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అం దించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా రా ష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో ఆయన పేర్కొన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. వివిధ యూకే బిజినెస్ స్కూల్స్‌కు సంబంధిం చిన డీన్‌లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వ విద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి వారితో తెలిపారు.

# సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమీకండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోడీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ ఇండియా–2026 ఈవెంట్ సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలో కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నాయి. కాగా ప్రధాని మోడీ 76 వ ఏట అడుగుపెట్టడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వాటాల పంపిణీపై కృష్ణా బోర్డు సమావేశం నిర్వహించనుంది. వచ్చేనెల 01వ తేదీన 21వ కృష్ణాబోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులకు సమాచారం అందించింది. ఈ మీటింగులో నీటి వాటాలతో పాటు వివిధ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం ఉంది. ఎల్ నినో నేపథ్యంలో ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటిని కేవలం తాగునీటికే వాడుకోవాలని ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. ఈ నెల 4న త్రీమెంబర్ కమిటీ మీటింగ్‌లో 50:50 నిష్పత్తిలో నీళ్లను పంచాలని మన రాష్ట్రం డిమాండ్ చేయగా ఎపి ఎప్పటిలాగానే 66:34 రేషియోలో పంచాలని సూచించింది.

# పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హైదరాబాద్–రంగారెడ్డి, వరంగల్–ఖమ్మం ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితా షెడ్యూల్‌పై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవి కాలం మార్చి 2027 నాటికి ముగియనుందని తెలిపారు. 2026 నవంబర్ 1ని ఓటరు నమోదుకు అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుందనీ, నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుందని తెలిపారు. డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫారం–18తో పాటు ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలు సమర్పించాలన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని చెప్పారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, డిజిగ్నేటెడ్ అధికారుల వద్ద ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పోస్టు ద్వారా కూడా ఫారం–18 దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు.**ఓటర్ షెడ్యూల్ వివరాలు...** 1). సెప్టెంబర్ 28న ఓటర్ల నమోదు ప్రక్రియకు నోటిఫికేషన్ 2). నవంబర్ 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా తయారీ 3).నవంబర్ 6 వరకు ఫారం–18 దరఖాస్తుల స్వీకరణ 4).నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల 5).నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ 6). డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

# కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని పేర్కొన్నారని, కానీ 2014 నాటికి 35 ఎకరాలు, 2018లో మరింత పెరిగి, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు చూపించారని వివరించారు.2023 నాటికి కేటీఆర్ కుటుంబ పేరిట 123 ఎకరాలు వచ్చాయని, 2026 నాటికి కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. సమర్పించిన అఫిడవిట్లకు, అసలు ఆస్తులకు ఎక్కడా పొంతన లేదని, తెలంగాణలో గజం భూమి లేని పేదలు ఎందరో ఉండగా కేసీఆర్ కుటుంబానికి ఇన్ని భూములు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములపై కచ్చితంగా సమగ్ర విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. తాము వారిని బదనామ్ (ప్రతిష్ట దిగజార్చడం) చేయడానికి ఈ విషయాలు మాట్లాడటం లేదని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలోని దళితులు, బీసీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు.జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ అంటున్నారని, కానీ ఆయన అక్కడే ఉంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపించారు. అయితే, ప్రభుత్వం ఎవరి ప్రైవేట్ ఆస్తులను లాక్కునే ఉద్దేశంతో లేదని స్పష్టం చేశారు.22ఏ నిషేధిత జాబితా విషయంలో ఎక్కడో ఒకచోట అధికారుల తప్పిదం ఉండి ఉండవచ్చని, దానిపై కూడా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ నిబంధనను ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ తమ స్వార్థం కోసం పెట్టలేదని స్పష్టం చేశారు.స్పీకర్ తల్లిపై బీఆర్ఎస్ నేతలు వాడిన భాష ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. పోలీసుల పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ఢిల్లీలో ఉన్న ఇంటికి, ప్రగతి భవన్‌కు బుల్లెట్ ప్రూఫ్ తలుపులు ఏర్పాటు చేసుకున్న తీరును గుర్తుచేశారు.అలాగే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని, గతంలో పనిచేసిన ఇంచార్జ్‌లు కూడా బాగానే పనిచేశారని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు.

# నా దేవాలయ సందర్శనను వక్రీకరించారు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలను, పత్రికల్లో వచ్చిన ప్రకటనలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా న్యాయమూర్తికి అందజేశారు. గత నెలలో కుటుంబ సభ్యులతో కలిసి హరీశ్‌రావు కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా దేవి ఆలయాన్ని సందర్శించుకున్న విషయం తెలిసిందే. ఈ ఆధ్యాత్మిక పర్యటనను కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని కోరుకుంటూ క్షుద్రపూజలు చేశారంటూ మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌లు గాంధీ భవన్ వేదికగా, మీడియాతోపాటు సోషల్ మీడియాలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు.రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు, కేవలం రాజకీయ దురుద్దేశంతో వ్యక్తి వ్యక్తిత్వాన్ని, ఆయన విశ్వాసాలను కించపరిచేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించామని తెలిపారు.పూజలను కూడా రాజకీయ బురద చల్లడానికి వాడుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కల్పిత ఆరోపణలపై గత నెలలోనే తన న్యాయవాదుల ద్వారా ఆ ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు పంపామని తెలిపారు. తాము చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశామని పేర్కొన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు వచ్చిన నోటీసును కనీసం తీసుకోకుండా ఉద్దేశపూర్వ కంగా తిరస్కరించారనీ, అద్దంకి దయాకర్ వ్యాఖ్యలను సమర్థించుకుంటూ పొంతన లేని సమాధానం ఇచ్చారని వివరించారు. వారు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదనీ, న్యాయస్థానం ద్వారానే తగిన గుణపాఠం చెప్పించాలనే ఉద్దేశంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు.

# మెట్రో నుంచి రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌నకు స్కైవాక్ - హైదరాబాద్‌లోనే ఫస్ట్ టైమ్ ఎక్కడంటే



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో రోజుకు లక్షన్నర వరకు వాహనాలు నలువైపులా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత రోజుల్లో పాదచారులు అటూ ఇటూ రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటుతున్నారు. కొన్నిసార్లు వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని గాయాలపాలవుతుంటారు. అంతేకాదు ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతాల్లో పాదచారులకు ఊరట కలిగించడానికి స్కైవాక్ ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. అయితే నగరంలో ఇప్పటి వరకు మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా మాల్స్‌కు, ఆఫీస్‌లకు చేరుకునేందుకు స్కైవాక్స్? ఉన్నాయి. మెట్రో స్టేషన్, ప్రగతినగర్ రోడ్డు, జేఎన్?టీయూ బస్‌స్టేషన్, లూలూమాల్ వైపు నుంచి సులువుగా పాదచారులు అటూఇటూ వెళ్లవచ్చు. మొట్టమొదటిసారిగా ఒక రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌నకు అనుసంధానం చేస్తూ స్కైవాక్ నిర్మించబోతున్నారు. అది ఎక్కడంటే ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి పక్కనే 3,576 ఫ్లాట్లతో నిర్మితమవుతున్న వాసవి ఆనంద గేటెడ్? కమ్యూనిటీకి నేరుగా చేరుకునేందుకు వీలుగా నిర్మించే స్కైవాక్? నిర్మాణానికి చట్టబద్ధ అనుమతులు లభించాయని వాసవి గ్రూప్? సీఎండీ యెర్రం విజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాదు ట్రాఫిక్ పోలీసుల నుంచి ఎన్?వోసీ వచ్చిందని, ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్ తర్వాత పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు. స్కైవాక్ వాసవి ఎవెన్యూస్ఎల్ఎల్‌పీ, ఎస్ఆర్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయని తెలిపారు. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోతో కుదిరిన ఒప్పందం ప్రకారం 6 నెలల్లో స్కైవాక్‌ను పూర్తి చేయాల్సి ఉంది. అయితే రూ.15 కోట్లతో చేపట్టే ఈ స్కైవాక్‌ను ఐఐటీ హైదరాబాద్ డిజైన్ చేసింది. సెంట్రల్ మీడియన్ నుంచి 14.5 మీటర్ల దూరంలో, నేషనల్? హైవే-65కు ఆనుకుని ఉన్న కాలిబాటల వరకు నిర్మిస్తారు. ఇందులో 10 ప్రధాన స్తంభాలు ఉంటాయి. ఒక్కో స్తంభం 5.94 మీటర్ల వ్యాసం, 8.64 మీటర్లతో ఎత్తుతో 12-14 మీటర్ల దూరంలో నిర్మిస్తారు. దీన్ని ఫ్యూచర్?లో కూడా ఎలాంటి ఆటంకం కలగకుండా డిజైన్? చేశారు. ప్రధాన స్కైవాక్? స్తంభం, అంతర్గత సరిహద్దు స్తంభం (దిగే మెట్లతో) మధ్య దూరం సుమారు 12.5 మీటర్లు ఉంటుంది. స్కైవాక్?లో ర్యాంప్?, లిఫ్ట్? సదుపాయంతో పాటు మెట్లు ఉంటాయి. స్కైవాక్?లతో కలిగే ప్రయోజనాలువాహనాలు వేగంగా వెళ్లే దగ్గర, జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉండదు. వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఎలాంటి భయం లేకుండా రోడ్డు దాటవచ్చు. ఈ స్కైవాక్స్? నిర్మించడం వల్ల ప్రయాణికులు ఒక మోడ్? నుంచి మరో మోడ్?కు సులభంగా మారవచ్చుబిజీగా ఉండే కూడళ్లలో రోడ్డు దాటడానికి ఎక్కువ సమయం వృథా కాదు. మోడ్రన్? స్కైవాక్?లలో వికలాంగుల కోసం ప్రత్యేక లిఫ్ట్?లు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని స్కైవాక్స్ నేరుగా షాపింగ్? మాల్స్? లేదా సముదాయాలకు అనుసంధానం చేసి ఉంటాయి. దీంతో వ్యాపారాలు, కస్టమర్ల సంఖ్య పెరుగుతుంది. స్కైవాక్?తో ప్రయాణికులు ఎండ, వాన తగలకుండా ఒక చోటు నుంచి మరో చోటుకి వెళ్లవచ్చు. వ్యాయామం, ఆరోగ్యం సురక్షితమైన వాతావరణం ఉండటం వల్ల ప్రజలు నడవడానికి ఆసక్తి చూపిస్తారు.

## తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన దినోత్సవ' వేడుకలు..

**జనగామ జిల్లా:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజా పాలన దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగానే దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాను స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి,జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సృజన్ కుమార్ మాట్లాడుతూ మండల ప్రజల ందరికీ 'ప్రజా పాలనా దినోత్సవ' శుభాకాం క్షలు తెలియజేసి శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడేది లేదని,ప్రజ లకు చేరువగా ఉంటూ పారదర్శ కమైన,వేగవంతమైన సేవలు అందిం చడమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## గిరిజనులకు రిజర్వేషన్లు కేసీఆర్ పుణ్యమే.. భావోద్వేగానికి లోనైనా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**కురవి :** గిరిజనులకు 6 శాతం నుంచి 10 శాతానికి రిజర్వేషన్లు పెంచి రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసిన మాజీ సీఎం కేసీఆర్ లంబాడీ గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండలంలోని పెద్దతండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలా భిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజ నుల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. గిరిజన రిజర్వేషన్ల పెంపుతోపాటు పోడు భూము లకు పట్టాలు, తండాలకు నిధులు, గిరిజన విద్యా ర్థుల కోసం గురుకులాల ఏర్పాటు తదితర కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాను మారుమూల తండాలో పుట్టిన తనకు రాజకీయ జీవిత చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించిన తండ్రి సమానులు మాజీ సీఎం కేసీఆర్‌కు పాదాభివందనాలు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యే వరకు చెప్పులు ధరించనని 2022 సెప్టెంబర్ 17న సత్యవతి రాథోడ్ ప్రతిజ్ఞ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నాలుగేళ్లుగా చెప్పులు లేకుండానే పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై జరిగే కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటున్నారు. ఆరోగ్యరీత్యా చెప్పులు ధరించాలని వైద్యులు సూచించినప్పటికీ తన సంకల్పం పూర్తయ్యే వరకు పాదరక్షలు ధరించబోనని ఆమె వివరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, బీఆర్ఎస్ నాయకులు శ్రీరాం నాయక్, ఐలి నరహరి, బోడ శీను, బాదె నాగయ్య, రాందాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తినిస్తాయి

మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారని, పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారని స్మరించుకున్నారు. హైదరాబాద్ విముక్తిలో సర్దార్ వల్లభ్?భాయ్ పటేల్ కృషి ఎంతో ఉందని, అది బలమైన భారత్ నిర్మాణానికి దోహదం చేసిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి మీద పాట రూపంలో అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. నిజాంకు వ్యతిరేకంగా యోధుల పోరాటాలుఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్?రెడ్డి నిజాం అద్భుత పాలన చేశాడన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు శోచనీయమని నిప్పులు చెరిగారు. నిజాం అంత మంచి పాలకుడైతే నాటి రావి నారాయణరెడ్డి, రాంజీగోండ్ చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్, సురవరం ప్రతాపరెడ్డి వంటి గొప్ప గొప్ప యోధులు ఎందుకు పోరాటాలు చేశారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాం మీద భారత ఆర్మీ ఎందుకు యుద్ధం చేసిందో చెప్పాలని అన్నారు. రాజకీయాలు, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు. తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలతెలంగాణ ప్రజలు నేడు 4 పండగలు జరుపుకుంటున్నారని, అవి గణేశ్ నవరాత్రి, విశ్వకర్మ జయంతి, సెప్టెంబర్ 17, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజని కేంద్రమంత్రి బండి సంజయ్? అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిజాం గొప్ప వాడని పొగుడుతున్నారని, ఇలాంటి వారి డీఎన్ఏను పరీక్షించాలని చెప్పారు. తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజెప్పే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి, ఆరోపణలు లేకుండా పాలన చేస్తుందని వివరించారు. తెలంగాణలో మార్పు కోసం రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారురజాకార్ల దౌర్జన్యాలను దాచి పెట్టార13 నెలలు ఆలస్యంగా తెలంగాణ గు స్వాతంత్ర్యం వచ్చిందన్న బండి సంజయ్, రాష్ట్ర ప్రజలపైన జరిగిన మారణకాండను పాలకులు 80 ఏళ్లుగా తొక్కి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్లీస్?కు భయపడి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల దౌర్జన్యాలను దాచి పెట్టారని అన్నారు. రజాకార్ల సంస్థ 1940లో ప్రారంభించి హిందువులు, దేవాలయాలపై దాడులు చేశారని తెలిపారు. తెలుగు అనాగరిక భాష అని నిషేధించి పరభాష అయిన ఉర్దూను మన మీద రుద్దారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణ రెడ్డి ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం మంచోడు అయితే తెలంగాణ గ్రామ గ్రామన ఎందుకు బురుజులు కట్టుకున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. నిజాం పోయిన ఆయన వారసత్వమైన మజ్లీస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తూ వస్తుందని బండి సంజయ్? అన్నారు.




# ఇందిరమ్మ ఇళ్లకు అర్హులు కావలెను! - సిటీలో పేదలే కనిపించట్లేదుగా!!



**హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరంలో 'ఇందిరమ్మ ఇళ్ల' పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ఇళ్లకు సరిపడా స్థానిక నివాసితులు దొరక్కపోవడంతో ఆ ప్రాంతాల్లో పేదలే లేరన్న భావన కలుగుతోంది. ఖైరతాబాద్?లోని ఇందిరమ్మ ఫ్లాట్ల కోసం ఇతర ప్రాంతాల వారిని ఎంపిక చేశారన్న ఎమ్మెల్యే దానం ఆరోపణలు క్షేత్రస్థాయి పరిశీలనలో నిజమని తేలడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పలు దశల పరిశీలన తర్వాత లాటరీ ద్వారా ఎంపికైన వ్యక్తులు అర్హత ప్రమాణాలకు అనుగుణంగా లేరని గుర్తించిన హౌసింగ్ బోర్డు ఇప్పుడు ఆ ప్రక్రియను పునః పరిశీలిస్తోంది. 'కోర్ సిటీ'లో భాగంగా పరిగణించే ఖైరతాబాద్‌తో పాటు శివారు నియోజకవర్గమైన ఇబ్రహీంపట్నంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 480 ఇళ్లకు కేవలం 200 మంది మాత్రమే అర్హులుఖైరతాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో నిర్మించనున్న 480 ఇళ్ల కోసం 6,970 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు సమగ్రమైన సమీక్ష నిర్వహించి 4,949 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 600 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. 480 మందిని 'సెలెక్ట్' జాబితాలో, 120 మందిని వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. అయితే తదుపరి క్షేత్రస్థాయి పరిశీలనలో కేవలం 200 మంది మాత్రమే నిజంగా అర్హులని తేలింది. మిగిలిన వారు ఇతర నియోజకవర్గాలకు చెందిన వారని తెలిసింది. నిబంధనల ప్రకారం నిర్దిష్ట నియోజకవర్గానికి చెందిన స్థానికులు మాత్రమే ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఖైరతాబాద్ ఎల్?ఐజీ ఫ్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో జూబ్లీహిల్స్, నాంపల్లి, అంబర్‌పేట్ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇళ్ల కంటే 30 శాతం అర్హులు తక్కువగా ఉండొచ్చు! ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఇక్కడ కూడా అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టి, 40 శాతం పరిశీలన పూర్తి చేశారు. ఇందులోనూ అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఇతర నియోజకవర్గాలకు చెందిన వారేనని తేలింది. సర్వే పూర్తయ్యే సరికి నిర్మించబోయే ఇళ్ల సంఖ్య కంటే 30 శాతం అర్హులు తక్కువగా ఉండొచ్చని సమాచారం. ఈ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఎల్?ఐజీ ఫ్లాట్ల కోసం 1,398 దరఖాస్తులు వచ్చినప్పటికీ అప్లై చేసుకున్న వారిలో ఎక్కువ మంది ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన వారని తెలుస్తోంది. ఈ గందరగోళానికి కారణం ఏమిటి?

## స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం.. 15 మంది విద్యార్థులకు అస్వస్థత



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17:** జిల్లాలో 15 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మునిపల్లి మండలం పెద్దలోడి జెడ్‌పీహెచ్‌ఎస్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. (గురువారం)మధ్యాహ్నం వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు విద్యార్థుల కోసం బిర్యానీ తెచ్చారు. అంతా కలిసి సరదాగా మాట్లాడుకుంటూ భోజనం చేశారు. విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాల్ కూడా బిర్యానీ తిన్నారు. కాసేపటికే విద్యార్థులు, వెంకటేశ్వర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆయనను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్కూల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. తమ పిల్లల పరిస్థితి చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సదాశివపేట ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు చికిత్స కొనసాగుతోంది.

## ఫాం పాండ్‌లపై రైతుల ఆసక్తి



**ఇల్లంతకుంట(కరీంనగర్):** చేనులో పడిన వర్షపు నీరు వృథాగా పోనివ్వకుండా అక్కడే నీటిని నిలువ చేసుకునేందుకు నిర్మిస్తున్న ఫాం పాండ్‌లపై రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. పంటల సాగుసమయంలో వర్షాలు సకాలంలో కురవకపోవడం, పంటవేసిన తర్వాత వర్షం పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీబీజీరాంజీ పథకం క్రింద రైతులు ఫాంపాండ్‌లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది. రైతులు ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండానే ఉపాధిహామీ కూలీల ద్వారా దీన్ని నిర్మిస్తున్నారు. 8మీటర్ల పొడవు, 8మీటర్ల వెడల్పుతో 6ఫీట్ల లోతుతో వరదనీరు వచ్చే ప్రాంతలో కూలీలతో గుంత తవ్వడంతో పాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వం ఉపాధిహామీ కూలీ లకు రూ. 50వేలు ఖర్చు చేస్తుంది. భూమికోతకు గురికాకుండా రాతి కట్టడం వల్ల నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంటుంది. ఫాంపాండ్‌ల నిర్మాణాలలో రైతుల ఆసక్తుల మేరకు కొలతలను ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలోని ముస్కానిపేట, ఇల్లంతకుంట, జంగమరెడ్డిపల్లె, గాలిపెల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే 24ఫాంపాండ్‌ల నిర్మాణాలు జరిగాయి. ఇవే కాకుండా అనంతగిరి, సిరికొండ గ్రామాల్లో కమ్యూనిటీ ఫాంపాండ్‌ల పనులు కొనసాగుతున్నాయి. వీటి నిర్మాణాల వల్ల రైతులకు ప్రయోజనాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు

# స్టేషన్ బెయిల్ కోసం రూ.10లక్షల లంచం - కీసర సీఐ, ఎస్సై అరెస్ట్, స్థానికుల సంబరాలు

**: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు చేయడం కలకలం సృష్టించింది. కీసర సర్కిల్ ఇన్స్?పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో నిందితుడికి స్టేషన్? బెయిల్ ఇచ్చేందుకు సీఐ ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో రకరకాల పనులు చేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్ డ్రింక్స్ తీసుకురావాలంటూ స్థాయి మరచి అధికారిన్ని దుర్వినియోగ పరచి వేధింపులకు గురి చేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మరోవైపు లంచంగా డిమాండ్ చేసిన డబ్బు తీసుకునే బాధ్యతను సీఐ ఎస్సైకి అప్పగించారు. ఈ సమాచారంతో ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. గణేశుల నిమజ్జనం విధుల్లో ఉండి రూ.5 లక్షల లంచంకీసర చెరువుగట్టు వద్ద గణేశుల నిమజ్జనం విధుల్లో ఉన్న ఎస్సై రూ.5 లక్షల లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై జ్ఞానేందర్? రెడ్డి అక్కడి నుంచి వేగంగా పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ఏసీబీ అధికారులను ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం పూర్తి వివరాలు తెలుసుకున్న అధికారులు ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి, సీఐ ఆంజనేయులును అరెస్టు చేశారు. సీఐ, ఎస్సై ఇళ్లలోనూ సోదాలుఏసీబీకి పట్టుబడిన కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. సీఐ ఆంజనేయులు ఇంట్లో రూ.5 లక్షలు, ఎస్సై జ్ఞానేందర్ ఇంట్లో రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలనూ స్వాధీనం చేసుకున్నారు. బాణాసంచా కాల్చి సంబరాలుపలు కేసుల విషయంలో లంచాల పేరుతో తీవ్రంగా వేధించేవారంటూ కీసర, బోగారం ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ ట్రాప్‌పై స్పందించిన కొందరు స్థానికులు కీసర పోలీస్ స్టేషన్ ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పలు కేసుల విషయంలో లంచం డబ్బులు డిమాండ్ చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. తాజాగా ఈ ఇద్దరు పోలీస్ అధికారులు ఏసీబీకి పట్టుబడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## విద్యుత్ శాఖపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పెరిగిన డిమాండ్



**అమరావతి, సెప్టెంబర్ 17:** విద్యుత్ శాఖపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. వేసవిని తలపించే ఎండల వల్ల 50 మిలియన్ యూనిట్ల మేర అదనంగా విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయంలో 240 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా.. ఈసారి 290 మిలియన్ యూనిట్లకు చేరిందని అన్నారు. విద్యుత్ జనరేషన్ కంపెనీలన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని చెప్పారు. థర్మల్ పవర్ స్టేషన్లలో 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉంచామని తెలిపారు. కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చినా అధిగమిస్తున్నామని అన్నారు. వర్షాలు లేకపోవడంతో హైడల్ విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. ప్రజలకు, వ్యవసాయానికి, పరిశ్రమలకు ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి 20 శాతం మేర విద్యుత్ డిమాండ్ పెరిగిందని మంత్రి అన్నారు. డిమాండ్‌ను బట్టి బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం అన్ని రాష్ట్రాల్లో ఉందని.. ఆ రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని చెప్పుకొచ్చారు. పగటిపూట సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి బ్యాటరీల్లో నిల్వ చేసి, పీక్ అవర్స్‌లో వినియోగించుకోవాలన్నది తమ ఆలోచనగా తెలిపారు. భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసుకుని దానికి తగ్గట్టుగా సామర్థ్యాన్ని పెంచుకుంటామని అన్నారు. 5,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## పదవుల కోసం ఎంతమంది మతం మారారో? – వైఎస్సార్సీపీపై విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**అమరావతి, సెప్టెంబర్ 17:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా ఆ పార్టీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సోషల్ మీడియా వేదికగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. వైఎస్సార్సీపీలో గతంలో ఎంతమంది నాయకులు ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం వైఎస్ జగన్?ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో, ఇప్పుడు ఆ పార్టీలో 'నంబర్‌వన్'గా ఉన్నవారే సమాధానం చెప్పాలని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి బుధవారం 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలకు మద్దతుగా 2024 ఎన్నికల ముందు వైఎస్సార్సీపీ అప్పటి కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్రైస్తవ సభలో మాట్లాడినట్లుగా ఉన్న వీడియోను కూడా విజయసాయిరెడ్డి ఈ పోస్ట్‌కు ట్యాగ్ చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది."140 రోజుల తర్వాత మనకు ఒక క్రైస్తవుడు ముఖ్యమంత్రిగా



ఉండాలి, అది జగన్ కావాలన్నదే నా కోరిక" అని వ్యాఖ్యానించినట్లు ఆ వీడియోలో ఉంది. అంతేకాకుండా, జగన్ ముఖ్యమంత్రిగా ఉంటే మనం ఎంత బలంగా ఉండవచ్చో వేదికపై ఉన్న పెద్దలందరికీ తెలుసని, గత ప్రభుత్వాల హయాంలో ఈ ప్రాంతంలో ఇటువంటి సభలు పెట్టుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడేవారో ఇక్కడున్న పాస్టర్ పెద్దలకు తెలుసునని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేలకు లంచాలిస్తే తప్ప సభలు జరిగేవి కావని ఆరోపిస్తూ "మన సభలు బాగా జరగాలన్నా, మన దేవుడిని బాగా ప్రార్థించుకోవాలన్నా, మనం స్వేచ్ఛగా ఉండాలన్నా క్రైస్తవ ముఖ్యమంత్రి జగన్ మరలా పీఠం ఎక్కాలి, దీనికి మీరంతా దీవించాలి. ప్రార్థన చేయాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నా" అని అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది. రాజకీయ పదవుల కోసం మతాన్ని వాడుకున్న తీరును విజయసాయి రెడ్డి ఈ విధంగా ఎండగట్టడం వైఎస్సార్సీపీ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతోంది.ఇదిలా ఉండగా, వైఎస్సార్సీపీని వీడిన విజయసాయి రెడ్డి త్వరలోనే సొంత రాజకీయ ప్రస్థానానికి తెరలేపనున్నారు. దసరా మర్నాడు ఆంధ్రప్రదేశ్‌లో తన కొత్త పార్టీని, జెండా, ఎజెండాలను అధికారికంగా ప్రకటిస్తానని ఆయన ఇటీవల వెల్లడించారు. తన వెనక ఎంతమంది బలం ఉందనేది ఆరు నెలల నుంచి ఏడాది లోపు అందరికీ స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. టీడీపీ, వైఎస్సార్సీపీ రెండూ కేవలం కుటుంబ పార్టీలని, ఒకరు పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని విమర్శిస్తూ, వీటికి మూడో ప్రత్యామ్నాయంగా తాను పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అదే సమయంలో అమరావతి రాజధానిని తాను వ్యతిరేకించడం లేదని ప్రకటన చేశారు.రెచ్చగొడితే నిజాలు బయటపెడతా: రెడ్డి సామాజికవర్గం ఎలా ఆవిర్భవించింది? రెడ్డి రాజులు ఎలా పాలించారనే సమాచారంతో తాను 350 పేజీల పుస్తకాన్ని రచించినట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఇదే సమయంలో వైఎస్సార్సీపీ నాయకత్వానికి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "వైఎస్సార్సీపీ కోటరీ మళ్లీ నన్ను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టాలని చూస్తే నా దగ్గర చాలా నిజాలున్నాయి. వాటన్నింటినీ త్వరలోనే బహిరంగంగా బయటపెడతా" అని హెచ్చరించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

## ప్రధాని మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి, సెప్టెంబర్ 17:** మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ చరిత్రాత్మకమని కొనియాడిన టీడీపీ అధినేత ప్రధాని స్ఫూర్తి దాయక ప్రస్థానాన్ని ప్రశంసించిన నారా లోకేశ్ దేశాభివృద్ధికి మోదీ నాయకత్వం కొత్త ఊపునిచ్చిందని వ్యాఖ్య వారణాసిలో ప్రధాని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొననున్న చంద్రబాబు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆయ నకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ జేశారు. గురువారం సోషల్ మీడియా వేదికగా వారు తమ సందేశాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానిగా మీ నాయకత్వం చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా సుమారు 25 ఏళ్ల మీ ఆదర్శప్రాయమైన ప్రజాసేవ భారత ప్రగతి ప్రస్థానానికి నూతనోత్తేజాన్ని అందించింది. 'సేవ, సంకల్ప్,



సుశాసన్' అనే మీ దార్శనికత 140 కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. 'భారత ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు. గుజరాత్‌లోని వద్నగర్‌లో ఓ చిన్న ఇంటి నుంచి దేశ ప్రధాని వరకు మీ ప్రయాణం, సంకల్పం, క్రమశిక్షణ ప్రజా సేవ పట్ల జీవితకాల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. సంవత్సరాలుగా మీ నాయకత్వం భారతదేశ ప్రయాణంలో అభివృద్ధి, స్వావలంబన, జాతీయ భద్రత, ప్రజల ఆకాంక్షలను కేంద్రంగా నిలిపింది. మీ నాయకత్వంలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ రంగాల్లో భారత్ దూసుకెళ్తోంది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల విస్తరణ నుంచి భారతీయ రైల్వేల వేగవంతమైన ఆధునీకరణ వరకు దేశ రవాణా రంగం ఓ కొత్త శకంలోకి ప్రవేశిస్తోంది. డిజిటల్ ఇండియా, యూపీఐ నుంచి మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వరకు మన సొంత సామర్థ్యాలపై విశ్వాసాన్ని బలపరిచింది. భారత్‌కు అంకితమైన మీ జీవితం, 25 సంవత్సరాల నిస్వార్థ సేవ ఆదర్శం. ఈ ప్రత్యేకమైన రోజున మీరు మంచి ఆరోగ్యం, దీర్ఘాయువుతో దేశానికి సేవ చేయడానికి నిరంతర శక్తిని పొందాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.దేశసేవలో ప్రధాని మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని, ఆయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.నారా లోకేశ్ సైతం ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. "సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న మీ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. మీలోని అపారమైన శక్తి, క్రమశిక్షణ, దేశాభివృద్ధి పట్ల మీకున్న అచంచలమైన నిబద్ధత ప్రజాక్షేత్రంలో ఉన్న మా వంటి లక్షలాది మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని కొనియాడారుఇదిలా ఉండగా, ప్రధాని మోదీ జన్మదినాన్ని నియోజకవర్గమైన వారణాసిలో నిర్వహించనున్న ' ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

## ఏడాది తర్వాత డీఎస్సీలో అక్రమాలంటూ మాట్లాడుతారా.. వైసీపీపై అనిత ఫైర్



**ప్రకాశం, సెప్టెంబర్ 17:** డీఎస్సీపై వైసీపీ చేస్తోన్న రాద్ధాంతంపై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. (గురువారం) మీడియాతో మాట్లాడుతూ. డీఎస్సీ జరిగి ఏడాది అవుతోందని.. ఇప్పుడు బయటకు వచ్చి డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ నాయకులు మాట్లాడటం సరి కాదని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెలకోసారి ప్రెస్‌మీట్ పెట్టి ఏది పడితే అది మాట్లాడి వెళ్లడం అలవాటైందని విమర్శించారు. అసలు వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి కూడా పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వ పని తీరును గమనించి రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలే తీర్పు ఇస్తారని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని దారి మళ్లించడానికే డీఎస్సీపై నిందలు వేస్తున్నారంటూ వైసీపీపై టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ మండిపడ్డారు. ఏపీపీఎస్సీపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీపై మంత్రి నారా లోకేశ్ సవాల్‌కు గొడ్డలి పార్టీ ఎందుకు స్పందించలేదని అడిగారు. డీఎస్సీపై.. చెప్పిన అబద్ధాన్నే 100 సార్లు చెప్పడం జగన్ నైజమని వ్యాఖ్యానించారు. డీఎస్సీపై జగన్ రోజుకో అబద్ధం చెబుతున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని అసమర్థ సీఎం జగన్ అంటూ విరుచుకుపడ్డారు. డీఎస్సీపై వైసీపీ నాయకులు వేసిన 320 కేసులను కోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఏపీపీఎస్సీని జగన్ అవహేళన చేశారని విమర్శించారు.

## గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు.. సిట్ ఎదుట ఏ4 సురేశ్ లొంగుబాటు




**విజయవాడ, సెప్టెంబర్ 17:**
గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ4గా ఉన్న సురేశ్.. సిట్ కార్యాలయంలో లొంగిపోయాడు. సాయికృష్ణ మృతి అనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో సురేశ్ పాత్రపై ఇప్పటికే పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయికృష్ణ మృతదేహాం మాయంచేసిన వ్యవహారంలో అతడు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు రావడంతో.. ఆ దిశగా సిట్ అధికారులు విచారణ చేపట్టారు.మరోవైపు.. సీఐ నాగరాజుకు సురేశ్ సన్నిహితుడిగానూ ఉన్నట్లు సమాచారం. సాయికృష్ణ కుటుంబ సభ్యులతో సెటిల్‌మెంట్ చేసేందుకూ సురేశ్ యత్నించినట్లు ఆరోపణలున్న నేపథ్యంలో.. ఆ వ్యవహారంపైనా దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కస్టోడియల్ డెత్‌కు దారితీసిన పరిస్థితులు, అనంతరం మృతదేహం మాయం కావడానికి కారణాలు, ఈ పరిణామాల్లో సురేశ్ పాత్ర ఎంతమేరకు ఉందనే అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. విచారణ అనంతర మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

**అమరావతి, సెప్టెంబర్ 17:** మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు.ఎమ్మెల్యేగా,



ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

## టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ

**అమరావతి, సెప్టెంబర్ 17:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు, అలాగే మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అందించిన సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 'వారణాసి--వాద్నగర్ సేవా యాత్ర చేపట్టారు.ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్?ను అనుసంధానిస్తూ నిర్వహించే ఈ యాత్రలో యువత, ప్రజాప్రతినిధులు, సేవా ప్రతినిధులు భాగస్వాములు పాల్గొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత ప్రాధాన్యతను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని, అనంతరం రుద్రాక్ష్



అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్?లో సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమం చేపట్టారు. వారణాసిలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్?నాథ్, కేంద్రమంత్రులు చిరాగ్ పాసవాన్, పంకజ్ చౌదరి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్?తో కలిసి సీఎం చంద్రబాబు ఆలయంలో పూజ లు నిర్వహించారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు : అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు, "ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా మారబోతుంది. భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. సానుకూల దృక్పథం ఉంటే ఉన్న తస్థానాలకు వెళ్లగలరు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల పేదరికం నుంచి బయటపడ్డారు.లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు చేస్తున్నారు.కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. కొవిడ్ సమయంలో 140 కోట్ల మందిని ప్రధాని మోదీ కాపాడారు. ప్రధాని మోదీ ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు ప్రధాని మోదీ కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది, ప్రస్తుతం భారత్‌లోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతుంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. బేటీ బచావో బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతోందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రధాని మోదీ ప్రపంచానికి చూపించారు. దేశంలో తీవ్రవాదం లేకుండా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారు. ప్రధాని మోదీ చర్యల వల్ల దతీవ్రవాదం అంతమైంది. ప్రధాని పరిష్కరించారు. అయోధ్యలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తాం.

## వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. సింహ వాహనంపై మలయప్ప దర్శనం



**తిరుమల :** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామి యోగ నరసింహుని ౦లో సింహ వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు.స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ సింహ వాహనసేవ అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సాగింది.సింహరూప దర్శనం మనలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను, విజయస్ఫూర్తిని మేల్కొలుపుతుందని ఆధ్యాత్మిక విశ్వాసం. సోమరితనాన్ని వీడి కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగేందుకు సింహ వాహనసేవ స్ఫూర్తినిస్తుందని అర్చకులు తెలిపారు. ఈ వాహనసేవ లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో కే వి మురళీకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.


Printed, Published & Owned by Rachakonda Printers & Publication's at P. Mahesh Goud Office address :-Dwaraka nagarRoad no:6 Plot : 101500079 RR dist, Hyderabad TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H. No:- 5-2-396 Venkateshwara colony Saheb nagar Rangareddy 500070 TELANGANA STATE. EDITOR : P. Mahesh Goud 9908 502 602 , PRGI NO:- TGTEL/26/A6429. EMAIL: youvavelugu@gmail.com https://epaper.yuvavelugu.com